# బాబూజీ

విజయవాడ చేరగానే కంపెనీ నుంచి స్టేషన్‌కు ఎవరో ఒకరు వస్తారని తెలుసు. అయినా నేను వెళ్ళేది కొత్త ప్రాంతం అన్న ఆలోచన మనస్సుని బాధపెట్తోంది.

సాయంకాలం మబ్బుపడిన ఆకాశం క్రింద విజయవాడ స్టేషన్‌లోకి మెల్లిగా రైలు పాకుతూంటే, ఓ పక్క చీకటికి పహరా ఇస్తున్న జవానులా కొండ, మరోపక్క నిశ్శబ్దాన్ని భరించలేక దిగాలుగా పడిఉన్నట్టున్న కృష్ణా నదినీ చూసి మనస్సు పిరికితనంతో వణికింది.

రైలు ఆగేసరికి ఆకాశం మధ్య కూడుకొన్న మేఘం, లోభికి ఆశాభంగం కలిగినప్పటి దుఃఖం లాగ రెండు కన్నీటిబొట్లను రాలుస్తోంది. ఈ చీకటికి భయపడి విజయవాడ ఒక భాగమంతా డొక్కలో కాలుతన్ని పెట్టుకు పడుకొన్న కుక్కలాగ ఉంది.

కోటును చెవుల వరకూ లాక్కొని, నా చేతుల్లోని సామాన్లను తనవి చేసుకు నడుస్తున్న కళాసి వెనక పరిగెత్తాను. కంపెనీ మనిషి ఒక్కరూ కన్పించలేదు. నాకు కనీసం స్నేహితులన్నా, కొత్త ఊరిలో దొరుకుతారా అని ప్లాటుఫారమంతా వెదికే ప్రయత్నంలో మురళి కన్పించాడు. ఎప్పటిదో చిన్ననాటిస్నేహం. చూస్తే చాలా వయస్సు మీరిన వాడిలాగ కనిపించాడు. రెండు చేతుల్లో పళ్ళబుట్టలు, ఓ సూట్ కేసూ, బెడ్డింగు, భుజానికి పెద్దబ్యాగ్– ఇంత బరువుతో అందర్నీ తోసుకుంటూ కంపార్టుమెంటు ఎక్కబోతున్నాడు, వెనకనే వాడి భార్య కొడుకుని ఎత్తుకుని వస్తోంది.

పలకరించాను. నన్ను గుర్తుపట్టి మాట్లాడే స్థితిలో లేడు వాడు. కంపార్టుమెంటులో

చోటు చేసుకోవడం ముఖ్యలక్ష్యం. అంచేత నన్ను చూడగానే పోలిక పట్టాడో లేదో చెప్పలేనుగాని, ఓపెట్టి, పళ్ళబుట్టలు నాకందించి "కాస్త పట్టుకో మిస్టర్! – లోపలికి వెళ్ళగానే కిటికీలోంచి అందివ్వండి" అని ఒక్క ఊపున లోపలికి ఎక్కేశాడు. అందర్నీ తోసుకుంటూ వచ్చి కంపార్టుమెంటు కిటికీ దగ్గర బెడ్డింగు పరిచాడు. అక్కడికి స్థిమితపడి నా చేతిలో పెట్టెను బుట్టల్నీ అందుకున్నాడు. మెల్లగా పెళ్ళాన్ని కుర్రాణ్ణి కూర్చోబెట్టి అప్పటికి నా దగ్గరికి వచ్చి నిలబడ్డాడు.

"ఎవరండీ మీరు?" అంటూ.

ఆశ్చర్యపోతూ గుర్తుచేశాను.

అప్పటికి నన్నుగుర్తుపట్టినట్లున్నాడు. ఒక్క ఉదుటున కౌగలించుకుని "పాపం! – చాలా సేపు పెట్టె మోశావ్ కాబోలు ఇంకా మన సబార్డినేట్ ఎవరో అనుకున్నాను" అన్నాడు.

"వాళ్ళయితే ఇలా పెట్టెలు మోయిస్తావేమిటి?"

"మోయించడమేమిటి? – వాళ్ళే మోస్తారు – మనకింద ఉద్యోగులు మనమీద ఒక పెద్దశిక్ష. ఏ పనీ మనల్ని చేసుకోనివ్వరు. వాళ్ళు సరిగ్గా చేసి చావరు. సరేలే. ఇలా వచ్చావేమిటి?"

"ఇక్కడికి బదిలీ చేశారు నన్ను. నాకీ ఊరంతా కొత్త. నువ్వెక్కడికి?"

"తిరుపతికి ప్రయాణం – మా అత్తగారికి క్రిందటి జన్మలో నేను శత్రువునయి ఉంటాను. ఈ నెలలో తిరుపతి వెళ్ళడం చేస్తే వాయిదా వెయ్యడానికి వీలులేదంది. ఆరునెలల వాయిదాలేసి, ఇక ఇవ్వాళ బయలుదేరాను. అయితే ఈ ఊరు బదిలీచేశారా నిన్ను."

"ఊఁ"

"భేష్! – అంతా పదిరోజులు ఆఫ్. తరవాత మా ఇంటికి తీసుకుపోతాను. పుష్పక విమానంలా ఉంటుందిలే – అంతవరకూ ఏ హోటల్లోనయినా దూర్లు"

"అంతవరకూ నాకేదన్నా తోవ చూపించు."

తల గోక్కున్నాడు. "సరే ఎవరన్నా స్నేహితుల్ని ఇక్కడే సృష్టిస్తాను పద" అని నన్ను ప్లాట్‌ఫారం అంతా తిప్పాడు. హఠాత్తుగా హిగిన్ బాదమ్సు బుక్‌స్టాల్ దగ్గర ఆపాడు.

ఒక్కసారి నావేపు తిరిగి ఉత్సాహంతో వెనక నడుస్తున్న నన్ను బరబరా ఈడ్చుకొచ్చాడు. "బ్రహ్మాండమయిన కంపానియన్‌ని చూపిస్తాను. ఇతనితో ఉంటే నీకు పని తక్కువ. మాట్లాడవలసిన విషయం చెప్పేసి వదిలేస్తే చాలు, అలా చెప్పుకుపోతాడు. మధ్యలో ఎప్పుడూ ఆపు చేయకు. అతనికి చచ్చేటంత కోపం వస్తుంది. పరిచయం చేస్తాను పద" అన్నాడు.

హిగిన్ బాదమ్సు దగ్గర ఎలక్ట్రిసిటీ స్తంభానికి చేరబడి నిలబడి అమెరికన్ సిగార్‌ని నోట్లోవుంచి పొగలు వదులుతూ ఓ "లండన్ రివ్యూ"ను తిప్పుతున్న వ్యక్తిదగ్గర ఆపాడు.

మురళీని చూడగానే సిగార్ తీయకుండానే కళ్ళతో నవ్వాడు ఆయన. కుక్కబొమ్మల కోసం మాగజైన్లన్నీ వెదుకుతున్నాడు. "కంపానియన్ లేక మా కుక్క రాత్రంతా అరుస్తోంది. దాన్ని స్నేహితుడు ఇటీవలే చచ్చిపోయాడు. అందుకని కుక్కబొమ్మలు దాని రూంనిండా అతికించాలని పథకం. కాని డామ్ డర్టీ మాగజైన్స్ – ఎన్ని వెదికినా, కుక్కబొమ్మలు కన్పించవు. ఎంతసేపూ సినీతారలు, ఒలింపిక్ చాంపియన్ల వీపు క్లోజప్లూనూ, ప్రతి మాగజైన్లో కనీసం మూడు కుక్కబొమ్మలు ఉండితీరాలని ప్రభుత్వం ఒక చట్టం చేస్తే బాగుంటుంది. అప్పుడు పుస్తకాల వల్ల కనీసం జంతువులకన్నా లాభం కలుగుతుంది" విసుగ్గా మాగజైన్ను పుస్తకాల స్టాల్లో పడేశాడు ఆయన.

మురళి మాట్లాడడానికి ఇప్పటికి అవకాశం కలిగింది. "ఒక్క విషయం బాబూజీ" అనబోతున్నాడు.

ఆశ్చర్యంగా ఇటువేపు తిరిగాడతను. "అరే! నాతో విషయం అంటూ ఏ విషయం ఎవరూ చెప్పరు. విషయం కంటె పీఠిక ఎక్కువయితే సహించన్నేను – ఇప్పుడు చెప్పండి" – ఇంతసేపటికి మొదటిసారిగా నన్ను చూశాడు. మొదటిసారిగా సిగార్ను నోట్లోంచి తీశాడు. చేతికర్రను కుడిచేతినుంచి ఎడమ చేతిమీదకు మార్చుకున్నాడు.

క్షణం ఆగి ఏమనుకున్నాడో ఏమో "ఈయన్ని నాకు పరిచయం చేయండి" అని మురళితో సీరియస్గా అన్నాడు.

"అందుకే ఎదురుచూస్తున్నాను – ఫలానా – విశాఖపట్నం నుంచి వచ్చాడు."

"ఆ మాత్రం చాలు–" అని నావేపు తిరిగి "పరిచయాలన్నీ – పద్దెనిమిదవ శతాబ్దపు ఫేషన్ అండి. సరిగ్గా లెక్కవేస్తే జీవితంలో సగం భాగం నిద్రకు, 1/4 వ వంతు అబద్ధాలు చెప్పడానికీ పోనూ – మిగతా సగంలో సగం పరిచయాలకే ఖర్చవుతుంది. ఓల్డ్ట్రాష్. ఉండండి కుక్కబొమ్మలు వెదుక్కుంటాను" – అని మళ్ళీ పుస్తకాల షాపువేపు తిరిగాడు.

ఇంతలో రైలు కూతవేసింది. మురళికి విసుగూ, అతని మీద కోపం. నావేపు తిరిగి "నువ్వే ఏదో తంటాలుపడు. ట్రైన్ బయలుదేరే వేళయింది. పోతాను" అని పరిగెత్తాడు.

స్థబ్దుడినయి అచేతనంగా నిలబడిపోయాను. మనస్ఫూర్తిగా చుట్టపొగ వదుల్తూ, ఏదో పాతబెంగాలీ జానపదాన్ని కూడబలుక్కుంటూ పుస్తకాలన్నీ కెలుకుతున్నాడతను. లైటు వెలుగులో ఈసారి అతన్ని జాగ్రత్తగా పరికించాను. వయస్సు నలభై పైన ఉంటుంది. సన్నటి మీసాలూ, గోల్డు ఫ్రేమ్ కళ్ళద్దాలు, పొడవుపాటి మిల్లుపంచె, నేలకు జీరాడేలాగ బెంగాలీకట్టు, పైన కాంగ్రెసు టోపి, ఆ టోపీలో జుత్తు ఏమీ మిగలలేదని స్పష్టంగా తెలుస్తోంది.

దీపం నీడలో అట్లాగే అచేతనంగా నిలబడ్డాను. కళాసీ సామాన్లు పట్టుకు కేకలు వేస్తున్నాడు. ఇక ఆగలేక 'బాబూజీ' అన్నాను. ఎవడో భుజం తట్టినట్లు తుళ్లిపడి ఇటు తిరిగాడాయన. "ఓహ్! మీరా? వెళ్ళిపోయారనుకున్నాను. కుక్క బొమ్మలు లేవు. ఈ

పత్రికా సంపాదకులకు కుక్క దగ్గర ఆరునెలలు తర్ఫీదు ఇవ్వాలి – ఇక పదండి" అన్నాడు నా భుజం మీద చెయ్యి వేశాడు. ఎక్కడికని అడగలేదు, వంతెన మీదకు నడిచాడు. మురళిని గురించి నన్నేమీ ప్రశ్నించలేదు. నేను అతనికి పాతమిత్రుడినయినట్టు మాట్లాడుతున్నాడు, ఉన్నట్టుండి నా వేపు తిరిగి "విజయవాడకు ఇదివరకెప్పుడయినా వచ్చారా?" అన్నాడు ఏదో తోచినట్టు.

"లేదు" అన్నాను.

అతని కళ్లు మెరిశాయి. "భలే! అయితే ఇది తప్పకుండా కొత్త అనుభవం – దీని ప్రశస్తి చెప్తాను వినండి – ఆంధ్రా పారిస్ అనొచ్చు దీన్ని. మొదటి రోజున ఇక్కడ వాతావరణాన్ని, స్త్రీలని అసహ్యించుకోవడం ప్రారంభిస్తాం. తమాషాగా రెండు రోజులయేసరికి వారు లేనిదే బ్రతకలేమనిపిస్తుంది. ఈ మురికి మధ్య, వింత మనుషులమధ్య బ్రతకడం వ్యసనమయిపోతుంది. నరకానికిలాగ విజయవాడ వచ్చిన వాడెవరూ వెళ్ళడానికి ఇష్టపడడు. ఇక మూడోరోజు అల్లాంటి వాటిగురించి ఆలోచించరసలు. ఇక్కడ జీవించడమే 'ఆదర్శం' అయిపోవాలి. ఈ వంతెన దాటాక నా మాటలన్నీ గుర్తుంచుకోడానికి ప్రయత్నించకండి." మెల్లిగా నడిచాడు. పదిగజాలు వెళ్ళాక మళ్ళీ ఆగాడు. "ఈ ఊరులో ఎవరూ బ్రతకరు. బ్రతుకుతున్నామనుకొంటారు. అందువల్ల 'సుఖం' కోసం మీరెక్కడా వెదుక్కోకండి. ఇక్కడ సుఖానికి అర్థం మరణం" అని "నేను కొంచెం అట్లా బారేజిమీదకి పోయి గాలి మేసిరావాలి. మీరు రేపు సాయంకాలం సత్యనారాయణపురం వేపురండి. శ్రీమన్నారాయణ అంటే ఎవరన్నా చెప్తారు. రైలు స్టేషన్ దగ్గర నిలబడి "బాబూజీ" అని అరిస్తే నా కుక్క మీకు దారి చూపిస్తుంది. నా గురించి మీ స్నేహితుడేమి చెప్పలేదు మీకు. నాకు తెలుసు. నేను మాట్లాడడం వినడానికే చాలమంది వస్తారు నా దగ్గరికి – సర్కస్ చూడడానికి డబ్బు లేనివాళ్లు కూడాను. మీకు మాట్లాడాలనిపించనంతవరకూ నాతో గడపవచ్చు" వెనక్కి తిరిగి చూడకుండా కర్ర టకటకలాడించుకొంటు నడిచిపోయాడు బాబూజీ.

దుర్భరమైన వాసనవేసే కృష్ణాకాలవ వంతెన మీద ఒంటరిగా నిలబడిపోయాను నేను – వెనక విసుగుతో కళాసీ. మురళి మీద కోపంతో పాటు కన్నీళ్ళు తిరిగాయి. వెదుక్కొని చివరికి ఒక హొటలికి చేరుకున్నాను.

బాబూజీ అన్న పేరే బావుంది శ్రీమన్నారాయణకంటే. వ్యక్తిగా అతనిలో చిత్రమైన పోకడలు కన్పించినా, అంత మరీ అన్నిటికి దూరంగా ఏమీ పట్టనట్టు యాంత్రికంగా బ్రతడం నచ్చలేదు నాకు. స్నేహితుల్నీ పరిసరాల్ని మరిచిపోవడం, మరిచిపోగల తన ప్రతిభకు తృప్తిపడడం – ఇవే అతని లక్ష్యాలయితే, అతనితో సాన్నిహిత్యం మంచిదిగా తోచలేదు నాకు. కాని మా పరిచయం ఒక్క క్షణం. రేపు సాయంకాలం నేను బాబూజీ దగ్గరకు వెళ్ళకపోతే ఎవ్వరూ ఏమీ అనరు.

ం ం ం ం ం ం

అయినా వెళ్ళాను. విజయవాడ వీధుల్లో సాయంకాలం తిరిగే వేలాది యంత్రాల్ని చూస్తే వీరందరికంటె బాబూజీలోనే ఏ మూలో మనస్సులో సంతోషం మిగిలి ఉందనిపించింది. భయపడి ఊరువదిలి సత్యనారాయణపురం వేపు పారిపోయాను.

గార్డెన్‌లో బంతిచెట్లకు గొప్పు తవ్వుతున్నాడు బాబూజీ. "ఆడవాళ్ళకీ పువ్వులకు పెద్ద కాంట్రాస్టు ఉందండి. ఇవి పెరుగుతున్న కొద్దీ అందంగా తయారవుతాయి. ఆడవాళ్ళు అలాకాదు. అందువల్ల ఆడవాళ్ళని పువ్వుల్తో పోల్చకూడదు. కొమ్మల్తో పోల్చాలి" తను చెప్తున్నవి విపరీతంగా ఉంటున్నాయని తెలుసు. తెలిసే కళ్ళద్దాల క్రింద నుంచి ఓసారి చూసి నేను హాస్యాన్ని గమనిస్తున్నానని తెలుసుకుని తృప్తిగా నవ్వుకున్నాడు – అదీ బాబూజీ తరహా.

"కారణం ఏమిటంటారు?"

"చాలా చిన్న కారణం – తమ పెరుగుదల గురించే ఆడవాళ్లు హెచ్చు ఆలోచిస్తారు. వీటికి ఆలోచనేలేదు. కనుక ఆవిధంగా చూస్తే మంచి బ్రతుకు బ్రకతడానికి మన మనస్సు పెద్ద అడ్డంకి అనిపిస్తుంది"

"అదేమిటి? మనస్సు లేకపోతే మీకీ పూలను పెంచాలన్న ఉద్దేశం, నాకు మీతో స్నేహం చెయ్యాలన్న ఉద్దేశం ఎట్లా వస్తుందంటారు?"

"ఈ రెండూ జరగకపోతే మాత్రం నష్టం ఏముందండీ? – నేను పూలను పెంచకపోతే అవి ఎక్కడో పెరుగుతాయి. నాతో మీరు స్నేహం చెయ్యడానికి అంగీకరించేవరకే నా బాధ్యత, అటుతర్వాత నామీద మీకేదో క్షణంలో విసుగో, అయిష్టతో కలిగి స్నేహం మానేయవచ్చు. అప్పుడూ నేను బాధపడను."

చాలా సూటిగా మాట్లాడుతాడు బాబూజీ. మనస్సు ఊహించే విషయాలన్నీ కళ్ళతో గ్రహిస్తాడేమోనని భయం వేసింది. చాలా తొందరగా మాట్లాడుతాడు. ప్రతి భావం ఎప్పుడో తయారయి సిద్ధంగా ఉంటుంది. అన్న వాక్యాల్ని అనుభవించినట్టు విశ్వాసంతో చెప్తాడు. అందువల్ల ఏ మాట పరిహాసానికంటున్నాడో, ఏది కాదో, ఓ అంతక్కాని అర్థం కాదు. బాబూజీ మాట్లాడుతుండగా వినడం ఓ అనుభవం. బాబూజీలా మాట్లాడగలగడం ఓ తపస్సు.

ఎర్రటి శాలువా వంటినిండా కప్పుకున్నాడు. 'కిష్టయ్యా', అని అరిచాడు. ఓ నల్లటి, పొట్టి కుర్రాడు పరుగెత్తుకు వచ్చేడు. "రెండు కుర్చీలు నైట్‌క్వీన్ దగ్గర వెయ్ – ఈయనకు మంచి డ్రింక్ ఏది ఉంటుందో చూడు. నేను మాటాడుతుంటే మధ్యలో ఆపుచెయ్యకు" అని చెప్పి నా భుజం మీద చెయ్యి వేశాడు.

"నేను ఉన్నచోట మరొకరు ఇంకే విషయం ఆలోచించకూడదండి. మీరింకా వయస్సులో ఉన్నారు. ఏవిషయం ఆలోచించకపోవడంలో ఉన్న సుఖం ఇంకా మీకుతెలీదు. నావయస్సువచ్చాక ఈబాబూజీ గురించి ఆలోచించండి. మీరు కాకపోయినా, మీ మనస్సయినా కృతజ్ఞత చెప్పక మానదు. ఆరె! మళ్ళీ మనస్సు గురించి ఆలోచిస్తున్నానే!" అన్నాడు.

నాకతని మాటలన్నీ విచిత్రంగా ఉన్నాయి. ఏదో విప్లవాత్మకమైన గమనం కోసం ఒక జీవితకాలాన్ని ప్రయోగానికి వినియోగించాడనిపించింది. చిన్న ఇల్లు, ఒకే ఒక బోయ్ – చుట్టూ పూలమొక్కలూ, ఒక ఎద్దుబండి మరింకెవరూ మనుషులు లేనట్టు కన్పిస్తోంది. నైట్‌క్వీన్ నీడలో పొట్టి కుర్చీలో కూర్చుంటే లోపల వసారాలో పెద్ద త్యాగరాజు చిత్రం కన్పిస్తోంది.

"నా థియరీ మీకు విచిత్రంగా ఉన్నట్టు కన్పిస్తోంది కదూ? – ప్రపంచం మిమ్మల్నింకా చాలా అనుభవించాలిలెండి" అన్నాడు.

"ప్రపంచమా!"

"పోనీ జీవితం అనండి."

"అదేమిటి!"

"ఇది నా రిసెర్చ్. జీవితంలో ఏమి అనుభవిస్తున్నాం అని చాలా మంది గుంజాటన పడుతుంటారు. దాని జవాబు తెలుసుకునే ప్రయత్నంలో జీవితమే వాళ్ళని పూర్తిగా అనుభవించిపోతుంది. పాముకథ గుర్తుతెచ్చుకోండి. పాముని మీరు చంపాలి. లేకపోతే మిమ్మల్ని కరిచి వెనక్కు తిరిగే సరికి పారిపోతుంది. ఇక్కడ చంపటమంటే దాని విషం తీసేస్తే చాలు.

జీవితంలో విషమల్లా ఆలోచన, మనస్సు, పిరికితనం. వాటిని తొలగించడానికి పెద్ద ఆయుధాల్ని సిద్ధం చేసుకున్నాను నేను – నా మాటల్నీ, మిత్రుల్నీ, నవ్వకండి – ఇరవై ఏళ్ల తర్వాత మీకు దీని అర్థం బోధపడుతుంది –"

నాకు ఆయన మాటల మీద ఆసక్తి పెరుగుతోంది. చేతికర్రను నేలమీద టకటకలాడిస్తూ ఏదో పదాన్ని గొణుగుతున్నాడు. ఓ ప్రశ్నకు అయిదు నిమిషాలసేపు కూడబలుక్కున్నాను.

"అయితే మీరు జీవితాన్ని అనుభవించారా? జీవితమే మిమ్మల్ని అనుభవించిందా?"

ఒక్కసారి నా ముఖంలోనికి చూసి సుడులు తిరిగిపోతూ నవ్వడం ప్రారంభించాడు. అంతే. వెంటనే దగ్గుతూ ఉక్కిరిబిక్కిరయి కుర్చీలోంచి లేచాడు. దగ్గు ఆపుకోలేక విపరీతంగా గుంజాటన పడుతున్నాడు. నాకు భయమేసింది. బోయ్ ఈ శబ్దం విని పరిగెత్తుకు వచ్చాడు. ఒక్క క్షణం లోపలికి వెళ్ళి ఏదో ఎర్రటి ద్రవాన్ని గ్లాసులో తీసుకొచ్చాడు. నీటిని నోట్లో పోసుకుని పుక్కిలిస్తున్నాడు. కొంతసేపటికి స్థిమితపడ్డాడు. బోయ్ భుజం మీద ఆనుకొంటూ వచ్చి కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకొన్నాడు. బోయ్ ఏం మాట్లాడలేదు. వెళ్ళిపోయేడు. నాకు భయం. మరి కాస్సేపటికి కళ్లు విప్పాడు బాబూజీ, ఆ కళ్లు చూశాక వణుకు పుట్టింది. అప్పుడే పడిన గాయంలో చెదిరిన రక్తపు జీరల్లా అవుపించాయి.

నవ్వేతాడు. నాకు పెదవులు వణికాయి. "చాలా ఆయాసపడ్డారు. అనవసరంగా కదిపాను ఆ విషయాలు."

సమాధానం చెప్పలేదు. మొదట కళ్ళు మూసుకు వెనక్కు చేరబడి కాస్సేపటికి

అన్నాడు "మీ ప్రశ్నకు సమాధానాన్ని వినండి. జీవితం నన్ననుభవించలేదు. మేమిద్దరం రాజీపడ్డాం. నేను జీవితాన్ని జయించానని నా గర్వం. ఇంకా ఫలితం తేలలేదు –"

నా కింకా దిగ్భ్రమ తగ్గలేదు. బాబూజీ చాలా ఆయాసపడుతున్నాడు. నేనింకా మాట్లాడకపోవడం చూసి నవ్వేడు. "ఎడమవేపు ఊపిరితిత్తి లేదు. నాకు నాలుగేళ్లక్రితం ఆపరేషన్ చేశారు" అన్నాడు మెల్లగా.

కుక్క అరుస్తూ పరుగెత్తుకువచ్చి అతని ఒళ్ళోకి ఎగిరింది. దానితో ఏదో బెంగాలీలో మాట్లాడుతున్నాడు. ఒళ్ళంతా ఒక్కసారి వాసన చూసి అంతలో దిగి పారిపోయింది. నావేపు చూసి నవ్వాడు బాబూజీ. "నాకు దగ్గుతెర వొస్తే దానికి బెంగ. చూసేవరకు అరవడం మానదు. కుక్కని పెంచితే ఒక నష్టం ఉంది. దాని బుద్దులు తెలుసుకొన్న కొద్దీ మన తక్కువతనానికి సిగ్గేస్తుంది."

నాకివేం పట్టలేదు. పై విషయమే గుర్తు "మరెట్లా?" అన్నాను.

"ఏమిటి?"

"ఎడమ ఊపిరితిత్తి ...."

"ఏం లేకపోతే బ్రతకలేం? – అసలు నేను లేకపోతే ఎవరికి నష్టం?" అంతలో ఆగి "రోమీ ఏడుస్తుంది. బోయ్ తెల్లబోతాడు" అని "రోమీ నా కుక్క పేరు" అన్నాడు.

"మీ కుటుంబమంతా ఎక్కడుంది?"

మళ్ళీ కళ్లు మూసుకున్నాడు బాబూజీ. దగ్గు ఇంకా బాధపెడ్తున్నట్టుంది. కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. బుజం మీద శాలువతో తుడుచుకున్నాడు. అంతలో ఇటుతిరిగి ఏమిటన్నారు?"

"మీ కుటుంబం?"

ఈసారి నవ్వలేదు. "అంతాపోయారు. రజాకార్ల విప్లవం గుర్తుంది కదూ?"

"ఊఁ"

"అప్పుడు కలకత్తాలో జరిగిందిలెండి .... ఈ నైట్ క్వీన్‌ని చూడండి. బెంగాల్ నుంచి తెప్పించాను – నైట్ క్వీన్ వాసన తగిలినప్పుడల్లా దేవుడున్నాడన్న స్ఫురణ వచ్చి వణికిపోతుంటాను" – మాట మరిచి పోయాడు.

నేనింకా సూటిగా అతన్నే చూస్తున్నాను. నా కళ్ళను గమనించి దొరికిపోయాడు. "మగాడు గతం గురించి ఆలోచించి, ఆడది భవిష్యత్తు గురించి ఆలోచించీ చెడిపోతారండి, మగాడు భవిష్యత్తు గురించి ఆలోచించగలగాలి. స్త్రీ గతాన్ని తల్చుకుని బ్రతకాలి"

"కుటుంబమంతా....."

"నన్నెవరూ ఆ ప్రశ్నలు అడగరండి. నా మనసు బాధపడుతుందని తెలుసు" ముఖం నైట్ క్వీన్ వేపు తిప్పుకున్నాడు.

ఆవిషయాలు మరచిపోవాలన్న ప్రయత్నం స్పష్టంగా తెలిసింది. ఇంకేవిధంగానూ

నన్ను ఆపలేక తప్పనిసరిగా వారించాడు బాబూజీ, నేనింకా ఆలోచిస్తున్నాను.

"ఎనిమిదేళ్ల చిన్న అమ్మాయి ఉండేది. అరుణ అనుకుంటాను పేరు. రాత్రి ఆ అమ్మాయిని తీసుకుని రైలు అందుకోడానికి పరిగెత్తుతున్నాను. ఎవరో వెనక నుంచి వీపు మీద ఎడమవేపు పొడిచారు. అంతే గుర్తు నాకు. ఆ తరువాత అరుణ ఏమయిందో తెలీదు. లేచిచూస్తే జమ్‌షెడ్‌పూర్ హాస్పిటల్లో ఉన్నాను. ఎవడో ఒక మహమ్మదీయుడు తీసుకువచ్చి చేర్చాడు. అరుణ గురించి ఎవర్నీ అడగలేదు తరువాత – ఎవరిని అడగాలో తెలీదు."

నేను మాట్లాడడం లేదు, అడగవద్దన్నాడేగాని, తీరా గుర్తుకు వచ్చాక గతమంతా ఒక్కసారిగా మనిషిని రెపరెపా వణికించడం గమనించాను. మరిచిపోవడం ఎట్లాగో తెలీక లేచి పచార్లు చేస్తున్నాడు.

"మరి రెండు రోజులకి ఊపిరితిత్తులు ఆపరేషన్ చేశారు. ఎడమవైపు ఊపిరితిత్తిలో బాకుకొన విరిగిపోయింది. దాన్ని తీయడం డాక్టర్ల చేతకాలేదు. మృత్యువుతో చెయ్యికలిపి, పన్నెండేళ్ళు బ్రతికాక, మొన్న తప్పనిసరిగా ఆపరేట్ చెయ్యవలసి వచ్చింది. ఆ కొన ప్రతీ ఇరవై రోజులకీ స్థలం మారేది. చివరికి ఎడమ ఊపిరితిత్తినంతా తొలగించవలసి వచ్చింది."

బోయ్ డ్రింకు తెచ్చాడు. అంతలో మళ్ళా ఉత్సాహంగా తయారయాడు బాబూజీ. "చాలా కష్టం వచ్చినప్పుడు – మంచి డ్రింకు చాలండి మనస్సు స్థిమిత పడటానికి. మీకేమయినా కష్టాలొస్తే నన్ను మందుగా ఉపయోగించుకోండి" అని కుర్చీలో కూర్చున్నాడు.

"ఎక్కడ పనిచేసేవారు?"

"మొదట మిలట్రీలో – పదేళ్ళ తర్వాత వచ్చేశాను– తర్వాత ఓ కంపెనీలో" అంతలో చటుక్కున నావేపు తిరిగి "ఓ వింతకథ మీకు చెప్తాను, అదొక్కటే నేను జీవితంలో నిర్లక్ష్యంగా చేసిన అల్లరిపని. ఇప్పటికీ ఆ విషయం తల్చుకున్నప్పుడల్లా విచారం కలగదు – నవ్వు వస్తుంది – జాలివేస్తుంది" అన్నాడు.

పోర్టికోలో దీపం వెలిగించాడు బోయ్. సాయంకాలం గాలికి నైట్ క్వీన్ వయ్యారంగా కదులుతోంది. చేతులు వెనక్కి వేలాడేసి పాములా మెలికలు తిరిగి కుర్చీలో ఓ మూలకి ఒదిగి కూచున్నాడు బాబూజీ.

"నేనాకంపెనీలో ఉండగా ఓ రోజు ఒక యువకుడు – దాదాపు ఇరవై ఎనిమిది ఏళ్ళు ఉంటాయనుకుంటాను వచ్చాడు ఉద్యోగం కావాలని. నా కప్పట్లో నిర్లక్ష్యం. దేనికీ హెచ్చుకాలం వృథా చెయ్యకూడదు. ఒక విషయాన్ని గురించి హెచ్చుకాలం ఖర్చుచేస్తే చేతకానివారికిందే లెక్క – అని అప్పట్లో నా మతం, చాలా బీదవాడిలా కన్పించాడతను. బట్టలు బాగా చిరిగి పోయాయి. మరి రెండు రోజులు అన్నం లేకపోతే చచ్చిపోతాడు. అదీ వాడి పరిస్థితి. నా దగ్గిరకి వచ్చి ఉద్యోగం కావాలన్నాడు మొదట. నాకు ఆశ్చర్యమేసింది. ఏమీ చేతకానివాడు ఉద్యోగం సంపాదించుకొందుకు తిరుగుతాడు. అన్నీ చేతనయినవాణ్ని ఉద్యోగమే సంపాదించుకొంటుంది. అయితే ప్రపంచంలో మంచివాళ్ళలాగ ఉద్యోగాలు

కర్కువైన రోజులవి. వీడు బికారి. నాకు నవ్వొచ్చింది. హెమ్మన్నాను. కాని వాడి సమర్థత మీద వాడికి పెద్ద విశ్వాసం – బిచ్చగాడు కూడ ఒక్క అవకాశం ఇస్తే అధ్యక్షపదవి చేసి చూపగలను అనుకుంటాడు. కాని అధ్యక్షపదవిలో ఉన్నవాడు మాత్రం బిచ్చగాడిగా బ్రతకడం సాధ్యం అనుకోడు. ఆ కష్టాన్ని అర్థం చేసుకోగలడు. అందువల్లనే వాడక్కడ, వీడిక్కడ – అదిసరే. ఆ యువకుడు రెండు రోజులు కన్పించలేదు. ఆ తర్వాత, పోయాడనుకున్నాను. అతని విషయమే పూర్తిగా మరచిపోయాను. కాని మూడో రోజున ఇంటి దగ్గర కనిపిస్తే ఇంకా బ్రతికే ఉన్నాడా అని ఆశ్చర్య పోయాను. మరీ నీరసంగా ఉన్నాడు. పలకరిస్తే మళ్ళీ ఉద్యోగం కోసం వచ్చాననే అంటాడు. విసుగేసింది నాకు. ఉద్యోగం అలాంటి వారికి ఎంత కష్టమో చెప్పాను. కాని వదల్లేదు వాడు"

"నీకేం చేతనవును అన్నాను చివరికి"

"ఈదడం వచ్చు"

నేను దిమ్మరపోయాను. నవ్వు కూడా వచ్చింది, ఈదడం వచ్చిన వాడికి ఆఫీసులో ఏం ఉద్యోగం ఇస్తాం?

"అయితే నే చెప్పినపని చేస్తావా?"

"చేస్తాను" అన్నాడు.

"ఇప్పుడు ఎనిమిదిన్నర అయింది. ఇప్పుడు నిన్ను హార్బరుకు తీసుకు వెళ్తాను. అక్కడ నువ్వు ఈదడం ప్రారంభించు. అయిదు గంటలు సమయం ఇస్తాను, మళ్ళీ మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకి నేను 'లాసన్స్‌బే' దగ్గర నీకోసం సిద్ధంగా ఉంటాను – ఈదడం వచ్చన్నావుగా మరి? అక్కడి నుంచి నిన్ను తీసుకువచ్చే ఏర్పాట్లన్నీ చేస్తాను. తరువాత నీకు సరిపోయే ఉద్యోగం గురించి చూస్తాను అన్నాను"

"హార్బరు నుంచి లాసన్సుబేకి ఆరుమైళ్ళ దూరం ఉంటుంది. సముద్రం చాలా లోతు. ఎంత బాగా ఈతవచ్చినవాడయినా ఈదడానికి నాలుగు గంటలు పడుతుంది–"

"నా మాట వినగానే మొదటవాడు తెల్లబోయాడు. కాని ఉద్యోగం కావాలి, గత్యంతరం లేక సరేనన్నాడు."

"నాకేదో మొండి ధైర్యం. వాడితో హార్బరుకు బయలుదేరాను. హార్బరుకు 8.45కి చేరాం"

"లాసన్స్‌బేకి మధ్యాహ్నం తప్పక వస్తారు కదూ" అని వాడడిగాడు ఆశగా. అలాగేనన్నాను.

నీళ్ళలో దూకి లేనిశక్తిని తెచ్చుకుని నీటిమీద తిరుగుబాటు చేస్తున్నాడు. ఏదో అవసానంలో ఉన్న జలచరంలాగ మెల్లగా పాకుతున్నాడు. వెనక్కి తిరిగి వచ్చేశాను" అని కథ ఆపేశాడు బాబూజీ.

"తర్వాత?" అన్నాను ఆత్రుతగా.

బాబూజీ మళ్ళీ నవ్వాడు. "ఇక ఈ కథకి 'తర్వాత' లేదు."

"అంటే!"

"పదిరోజులుగా సరిగ్గా తిండిలేనివాడు ఆరుమైళ్ళు ఈదిరాగలడంటారా? లాసన్స్‌బేకి ఆ తర్వాత నేను వెళ్ళలేదు. అవసరంలేదని తెలుసు."

నేను దిగ్భ్రాంతుణ్నయ్యాను. సూర్యాస్తమయపు దిగులుగాక ఆ కళ్ళల్లో ఇంకేదన్నా భావం కనిపిస్తుందా అని వెదికాను. ఈ 'దిగులు' అంతా నటన ఏమో – కథ విన్నాక మనస్సు కెలికినట్లయింది.

"ఎందుకల్లా చేశారు?" అన్నాను.

"ఉద్యోగమేదీ లేదు ఆ సమయంలో. నేను కాదన్నా వదలడు వాడు" అన్నాడు బాబూజీ.

ఆ కళ్ళమీద, ఆ చిరునవ్వు మీద నా కిప్పుడు నమ్మకం కుదరలేదు. ఆ పలచటి శరీరం వెనుక గుండె బరువుకి ఏ త్రాసూ నిలబడలేదేమో? అక్కడిక కూర్చొనేందుకు భయమేసింది. నాలో దిగ్భ్రమను బాబూజీ గమనించాడు.

"నేను చేసిన చిలిపితనం అది. అంతే. అంతకంటె దానికి మరో అర్థం లేదు. ఇప్పటికీ నాకా సంఘటన జరిగినందుకు విచారం లేదు. అతని మీద జాలి మాత్రం"

నైట్‌క్వీన్ కొమ్మలు కదుల్తే పల్చటి సువాసనలు తోటంతా పచారు చేశాయి. అంతకు మించి చల్లదనానికి శరీరం తపన పడింది. లేచాను – "ఇక పోతానండి".

నా నిశ్శబ్దాన్ని చూసి నవ్వుకున్నాడు బాబూజీ. చీకటిగా ఉన్న గేటు దగ్గరికి వచ్చాక భుజం మీద చెయ్యేసి 'నేను మీకు చాలా మంచి స్నేహితుణ్ని. నన్ను వదులుకోకండి' అన్నాడు.

ఏడు దాటాక ఆ ప్రాంతమంతా చీకటి. దూరంగా సూర్యాస్తమయపు చివరి కిరణం ఎరుపు తప్పించి ఎలక్ట్రిసిటీ దీపాల ఉపయోగం ఏమీ కన్పించదు. ఈ నిశ్శబ్దం మధ్య బాబూజీని గురించిన ఆలోచనలు నాకు తోడు.

ం ం ం ం ం

జీవితంలో అన్నీ మరచి బ్రతకగలగడం ఒకవరం. పెద్ద గతాన్ని వెనకేసుకొని కూడా, వర్తమానాన్ని పూర్తిగా భవిష్యత్తుకు వినియోగించుకోగలగడం చాలా మందికి సాధ్యం కాదు. బాబూజీలో ఆ ఒక్క గుణమే నన్ను మరీ ఆకర్షించింది. నిన్నటి అనుభవాన్ని సాక్ష్యం తెచ్చుకోకుండా ఏదీ సాధించలేని బలహీనతగల 'మనస్సు'తో ఈ భోగన్ విల్లా, ఈ నైట్‌క్వీన్, కుక్క, బోయ్, చిరునవ్వు, మాటలతో బాబూజీ హాయిగా ఎల్లా బ్రతుకుతున్నాడా అన్నది ఆశ్చర్యం. సంతోషాన్ని నటించాడా అనుకుందామనుకుంటే ఎవరికీ ఉపయోగంలేని విషయమది – ఏది ఏమైనా, భౌతికంగా చాలా సంతృప్తిగా కన్పిస్తాడు బాబూజీ. ఆ మాటల్ని, కళ్ళని తప్పించుకు పోలేడు ఎవడూ. ఆ మాటలకు ఆ క్షణాన్న ఎంత ఆశ్చర్యపోయి

చూసినా, విసుగుపడినా, వాటిలో నిగూఢ సత్యాన్ని, వాటి ఆకర్షణని తప్పించుకుపోలేడు ఎవడూ. తనమీద పెద్ద రక్షణ కవచాన్ని తొడుగుకుని మాటలు ప్రారంభిస్తాడు బాబూజీ.

విజయవాడలో ఉన్న రోజుల్లో మరి ఒకటి రెండుసార్లు ఆయన కలిశాడనుకుంటాను. ఓరోజున హఠాత్తుగా సినీమాహాలు దగ్గర కన్పించాడు బాబూజీ. ఎప్పుడూ ఆ ప్రాంతాల్లో చూడలేదు ఆయన్ని. ఆశ్చర్యపోయాను. నవ్వేడు.

"ఎప్పుడూ సంతోషంగా గడపటం కూడా రోగమేనండి. బాగా ఆలోచిస్తే హత్యలు చేసేవాళ్ళందరూ సంతోషం, తీరుబాటూ ఎక్కువయి, ఏం చెయ్యాలో తెలీక చేస్తారనుకుంటాను. సినిమా చూడకూడదని ఐదేళ్ల నుంచీ డాక్టర్ నిషేధం నాకు. ఇవాళ చూడాలనిపించింది. మన సుఖాన్ని పాడుచెయ్యడానికి అయితే ఈ డాక్టర్లు మనకి వద్దు" అన్నాడు. "మీరూ వస్తారా సినిమాకి?"

తప్పదని నడిచాను.

ఆరోజు విపరీతంగా చుట్టలు కాల్చాడు. దీనిని మానెయ్యమన్నాడు డాక్టర్ మొదట. "చుట్ట వదులుకోనేకంటె రోగాన్ని ఉంచుకుంటాను. చుట్ట, పెళ్ళాం, రోగం ప్రేయసి, ఎవరినో ఒకర్ని మిగల్చండి" అన్నాను. డాక్టర్ తెల్లబోయి "ఇద్దర్నీ మిగిల్చాడు" అన్నాడు.

ఆరాత్రి నన్ను సినీమా చూడనీయలేదు. విపరీతంగా మాట్లాడాడు. "సినీమా చూడటానికి కాదండి. చూశామన్న తృప్తికి" అంటూ ఏదో ఆవేశంలో, అర్థంలేని విషయాలు, సందర్భంలేని సంఘటనలు చెప్పాడు. నేను రెండుసార్లు ఆపుచెయ్యబోతే – "ఉండు. నన్ను మాట్లాడనీ. రోగం పెరుగుతుందని తోచినపుడల్లా మాట్లాడుతాను. మీరు చలివేస్తే దుప్పటి కప్పుకొంటారు. నేను నా జ్ఞాపకాల మీద మాటల్ని కప్పుకుంటాను" అన్నాడు. నేనింకేం మాట్లాడలేదు. అతని మనస్సులో గతాన్ని తల్చుకొన్న గిల్ట్ ఏమయినా ఉందా?

రాత్రి పదిగంటలకి చీకటిలోకి నడుస్తున్న బాబూజీని చూస్తే జీవించడం పట్ల ఈయనకెంత విశ్వాసమా అని ఆశ్చర్యపోయేను.

o o o o o

ఈ సంఘటనే నాకు బాగా జ్ఞాపకం. బహుశా చివరి సంఘటనే అనుకుంటాను. ఎందుకంటే – మరి రెండురోజులకే బాబూజీ చచ్చిపోయాడు.

-----